నాలుగేళ్లయినా.. అడుగుపడలే!

- సమీకృత మార్కెట్ నిర్మాణానికి నాలుగేళ్ల క్రితమే నిధులు మంజూరు
- ప్రభుత్వ స్థలం లేక పనుల్లో తీవ్ర జాప్యం
- రోడ్లపైన మాంసం, కూరగాయల విక్రయాలు


మార్కెట్‌కు ప్రతిపాదించిన ఆర్టీసీ బస్టాండ్ స్థలం


రోడ్డు పక్కన కూరగాయలను విక్రయిస్తున్న వ్యాపారులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణాల్లో మాంసం, కూరగాయల విక్రయాలు ఒకేచోట జరిగేలా గత ప్రభుత్వం సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పోచంపల్లి మున్సిపాలిటీలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం 2021లో రూ.3 కోట్ల నిధులను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది. టెండర్లు సైతం పూర్తయ్యాయి. కానీ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలం లేక పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత నాలుగేళ్లుగా ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడంతో మార్కెట్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. వచ్చే నెలలో మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం సైతం ముగియనుంది. దీంతో పోచంపల్లి మున్సిపాలిటీలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం కలగానే మిగిలిపోతోందని పలువురు వాపోతున్నారు.

స్థలం లేకపోవడంతో..

ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి స్థలమే అసలు సమస్యగా మారింది. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక బాలారిష్టాలు ఏర్పడ్డాయి. మొదట పట్టణ కేంద్రంలో ని బీసీ కాలనీలోని ఖాళీ స్థలంలో మార్కెట్ నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే స్థానికుల నుంచి తీవ్ర అభ్యంతరాలు రావడంతో వెనక్కి తగ్గారు. ఆ తరువాత పట్టణ కేంద్ర పరిధిలోని పర్రె కాలువ సమీపంలో దేవాదాయశాఖకు చెందిన 1002, 1003 సర్వే నంబర్‌లో గల 2ఎకరాల భూమిని మార్కెట్ నిర్మాణం కోసమని కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. కానీ దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మార్కెట్ నిర్మాణానికి నిరాకరించారు. చివరగా నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని తీసుకొని దీనికి బదులు జలాల్‌పురంలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం ఇచ్చేలా మున్సిపాలిటీ, ఆర్టీసీ అధికారులు పరస్పర అంగీకారానికి వచ్చారు. పట్టణ కేంద్ర శివారులోని నిరుపయోగంగా ఉన్న రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పోచంపల్లి ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని మార్కెట్ కోసం ప్రతిపాదించి కౌన్సిల్ తీర్మాణం చేశారు. కానీ మొదట్లో మార్కెట్‌కు ఆర్టీసీ ఆస్తులను ఇవ్వడానికి సంబంధిత అధికారులు సుముఖత చూపించలేదు. చివరకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని వినియోగించుకొని అందుకు బదులుగా ఆర్టీసీకి జలాల్‌పురం గ్రామ పరిధిలోని సర్వేనెంబర్ 80లో గల 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. కానీ ఆర్టీసీ స్థలం అప్పగింత ప్రక్రియ పనులు పూర్తి కాకపోవడంతో మార్కెట్ నిర్మాణం కార్యరూపం దాల్చలేదు.

రోడ్లపైన విక్రయాలు..

పట్టణ కేంద్రంలో సమీకృత మార్కెట్ నిర్మాణానికి స్థలం లేక చిరువ్యాపారులు చేనేత డై హౌజ్ సమీపంలో రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. ప్రతి ఆదివారం పట్టణ కేంద్రంలో పెద్ద ఎత్తున కూరగాయల సంత జరుగుతుంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మంచాల, దండు మైలారం, మల్కాపూర్, రాపోలు, పోచంపల్లి మండలం దోతిగూడెం, భీమనపల్లి, రేవనపల్లి, శివారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి 200 మంది వరకు రైతులు, చిరువ్యాపారులు ఇక్కడికి కూరగాయలు, ఆకుకూరలు, ఇతర నిత్యావసర సరుకులను తెచ్చి విక్రయిస్తున్నారు. ఇక్కడ కనీస సౌకర్యాలు, రాత్రి వేళ విద్యుత్‌దీపాలు లేక, వర్షాకాలంలో తలదాచుకోవడానికి షెడ్ లేక వ్యాపారులు, ఇటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రతి ఆదివారం ఇక్కడ సంత జరుగుతుంది. గత ఐదేళ్లుగా ఇక్కడికి వచ్చి కూరగాయలను విక్రయిస్తున్నాం. అయితే మార్కెట్‌లేక రోడ్డుపై పెట్టి కూరగాయలను అమ్ముతున్నాను. కరెంట్ లేక రాత్రివేళలో ఇబ్బందిగా ఉంటుంది. చార్జింగ్‌లైట్లు పెట్టుకొంటున్నాం. మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– యాదమ్మ, రాయపోలు, రంగారెడ్డి జిల్లా, చిరువ్యాపారి

స్థలం అప్పగిస్తే పనులు ప్రారంభిస్తాం



మార్కెట్‌కు అందుబాటులో స్థలం లేక నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. పట్టణ కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని మార్కెట్‌కు ప్రతిపాదించాం. ఆర్టీసీ వారికి బదులుగా జలాల్‌పురం పరిధిలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. ఆర్టీసీ అధికారులు అడిగిన మేరకు బస్టాప్ షెడ్ కూడా వేసి ఇచ్చాం. వారు బస్టాండ్ స్థలాన్ని అప్పగించిన వెంటనే మార్కెట్ నిర్మాణ పనులు చేపడుతాం.

– వెంకటేశ్వరనాయక్ మున్సిపల్ కమిషనర్, భూదాన్‌పోచంపల్లి

శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న గోదా శ్రీరాములు

భువనగిరిటౌన్ : సీపీఐ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో భువనగిరి నియోజకవర్గ సమితి సమావేశం గోడల నాగభూషణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ శతాబ్ది ఉత్సవాల ప్రారంభం సందర్భంగా నల్లగొండ పట్టణంలో నిర్వహించనున్న బహిరంగ సభకు పార్టీ కార్యకర్తలు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, బోడ సుదర్శన్, మండల కార్యదర్శులు మరిపెల్లి రాములు, పోలేపాక యాదయ్య, నాగభూషణ్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి


యూత్ లోగోను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ నాగరాజు

చౌటుప్పల్ : గ్రామాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని మున్సిపల్ కౌన్సిలర్ ఆలె నాగరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో ఆదివారం రుద్రసేన యూత్ ఆధ్వర్యంలో ప్రాచీన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యూత్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనిస్తూ గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల సమితీ మండల మాజీ అధ్యక్షుడు చీకూరి వెంకటేశం, రుద్రసేన యూత్ అధ్యక్షుడు అంతటి లింగస్వామి, ప్రధాన కార్యదర్శి జిట్ట కృష్ణ, ప్రతినిధులు జిట్ట జనార్దన్, దేశగోని శ్రీనివాస్, గోద లింగస్వామి పాల్గొన్నారు.

పెంచిన ఎరువుల ధరలు వెంటనే తగ్గించాలి


మాట్లాడుతున్న తుమ్మల సత్యనారాయణరెడ్డి

ఆత్మకూరు(ఎం): పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సీపీఎం మండల సమావేశంలో మాట్లాడారు. రైతుల సమస్యలు పరిష్కరించడంతో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నప్పటికీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా రైతులతో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి వేముల భిక్షం, రైతు సేవా సమితి జిల్లా కార్యదర్శి కానుగంటి శ్రీశైలం, నాయకులు కందడి వెంకట్‌రెడ్డి, రచ్చ గోవర్ధన్, రాచమల్ల సత్తయ్య, కొకుంట్ల మధుసూదన్‌రెడ్డి, సిరుగురు అంజయ్య, సామ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థుల ఆరోగ్యంపై పట్టింపు లేదు

రాజాపేట : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థుల ఆరోగ్యంపై పాఠశాల ప్రిన్సిపల్‌కు పట్టింపు లేదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సమీకృత భోజనాల పేరిట చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు సరైన సమయంలో భోజనం పెట్టకపోవడంతో ఓ విద్యార్థి సొమ్మసిల్లి ఆస్పత్రిపాలు కావాల్సి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన గురుకుల బాట సందర్భంగా పాఠశాలలో ఎక్కడ లోపాలు బయటపడుతాయోనన్న భయంతో గేటుకు తాళాలువేసి లోనికి రానివ్వలేదని ఆరోపించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అధికార పార్టీ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో సెక్రెటరీ జనరల్ భాస్కర్ గౌడ్, నాయకులు జశ్వంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే


పార్టీ సభ్యత్వం అందజేస్తున్న నాయకులు

రామన్నపేట : ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ మండలకార్యదర్శి ఊట్కూరి నర్సింహ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓట్లు సీట్లతో సంబంధం నిరంతరం ప్రజల పక్షాన పోరాడే కమ్యూనిజం అజేయమని తెలిపారు. నేటి పాలకులు ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాత్రి సమ్మయ్య, బాలగోని మల్లయ్య, గంగాపురం వెంకటయ్య, ఏనూతల రమేష్, ఊట్కూరి క్రిష్ణ, కల్యాణ్, యాదగిరి, మల్లేశం, మత్స్యగిరి, పట్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న నాయకులు

మోత్కూరు : మున్సిపల్ కేంద్రానికి చెందిన తెల్కలపల్లి రాజు, సూదగాని లక్ష్మమ్మలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పైళ్ల సోమిరెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కూరెళ్ల కుమార్, మార్కెట్ డైరెక్టర్ ఎం.డి.సమీర్, నాయకులు కారుపోతుల వెంకన్న, అన్నెపు పద్మ, నిమ్మల శ్రీను, గడ్డం లక్ష్మయ్య, మెంట నగేష్, గుండు శ్రీను, జిట్ట నరేష్, పల్లపు సమ్మయ్య, అనిల్, మురళీ, శేఖరాచారి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఇద్దయ్య, రాహుల్, లింగయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాజ్‌కుమార్

రాజాపేట : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జాతీయ వైద్య రత్న అవార్డు గ్రహీత, ఆర్కే ఆస్పత్రి వైద్యుడు సీహెచ్ రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని కుర్రారం గ్రామంలో ఆర్‌కే ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ఆధ్వర్యంలో అనేక వైద్య శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాండవుల కనకలక్ష్మి లక్ష్మణ్ గౌడ్, బూర్గు రమేష్, బాల్ద చంద్రయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ అంజిరెడ్డి, శ్రీను, డాక్టర్ బోగ జ్ఞానేందర్ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ఆత్మీయ సమ్మేళనం

మర్రిగూడ : మండలంలోని ఆయా గ్రామాల్లో 2013–18 సంవత్సరాల మధ్యకాలంలో సర్పంచ్‌లుగా పనిచేసిన 16మంది పంచాయతీ మాజీ సర్పంచ్‌లు ఆదివారం సంస్థాన్ నారాయణపురం మండల పరిధిలోని సరళ మైసమ్మ ఆలయం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు మాజీ సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు మాజీ సర్పంచ్‌లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాముల యాదయ్య, పాశం సురేందర్‌రెడ్డి, దంటు జగదీశ్వర్‌రెడ్డి, మాస నీలిమాచంద్రశేఖర్, అయిలి లక్ష్మీనరసింహా, మునగాల అంతిరెడ్డి, నారోజు కృష్ణమాచారి, లాలునాయక్, పాక నగేష్‌యాదవ్, రాచమల్ల నరేందర్‌రెడ్డి, ఎడ్ల శ్రీరాములు, దేశిడి శ్రీలత సురేందర్‌రెడ్డి, ఊడుగు అంజనమ్మఅంజయ్య, గంట సరితకృష్ణ, కంచుకట్ల సంపత్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముక్తాపూర్‌ను గ్రామ పంచాయతీగా మార్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ కృష్ణ

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లి మున్సిపాలిటీలో విలీనమైన ముక్తాపూర్‌ను తిరిగి గ్రామపంచాయతీగా మార్చాలని కోరుతూ ఆదివారం ఆ గ్రామ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మాణించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కొంగరి కృష్ణతో పాటు మాజీ సర్పంచ్‌లు మునుకుంట్ల బాలచంద్రం, దారెడ్డి మల్లారెడ్డి మాట్లాడుతూ ముక్తాపూర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీలో కలిపడంతో ఉపాధి హామీ కూలీలు జీవనోపాధి కోల్పోయారన్నారు. సామాన్య ప్రజలపై ఇంటి, నల్లా పన్నులు భారంగా మారాయన్నారు. అనంతరం సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తిరిగి గ్రామపంచాయతీ సాధించుకునే వరకు ఏ ఉద్యమానికి సిద్ధంగా గా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో నిజాం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తడక యాదగిరి, పట్నం కృష్ణకుమార్, అఖిలపక్ష నాయకులు భారత లవకుమార్, కొండమడుగు రాజు, డబ్బీకార్ సాహేశ్, చిక్క కృష్ణ, చింతకింది రమేశ్, కె. ఎల్లస్వామి, కె. భీమయ్య, నక్కల రాజిరెడ్డి, రాజమల్లేశ్, నరేందర్, రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సన్న నర్సింహ, మహేశ్, పాండు, లింగస్వామి, బాలయ్య, మల్లేశ్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి


నియామక పత్రాలు అందజేస్తున్న కిష్టాఫర్

వలిగొండ : తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి కిష్టాఫర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఉద్యమకారుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులను సమర యోధులుగా గుర్తించి తగిన న్యాయం చేయాలన్నారు. అనంతరం ఉద్యమకారుల మండల కమిటీ ప్రధాన కార్యదర్శిగా మంటి లింగయ్య ను, కోశాధికారిగా జోగు చిన్న యాదయ్య ను నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంటి రమేష్, గాజుల యాదగిరి, వెంకటేశం, నర్సింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె


సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భువనగిరిటౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన చేస్తున్న సమ్మె ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులతో తీసుకున్న లడ్డుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంగ పాండరి మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రాజాపేట : మండలంలోని రేణికుంట గ్రామంలో తల్లిదండ్రులు మృతి చెందిన అనాథలుగా మారిన నికిష, సాత్విక్‌లను ఆదివారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పరామర్శించారు. అనంతరం రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. డీఈఓతో మాట్లాడి చిన్నారులకు యాదగిరిగుట్ట వసతి గృహంలో సీట్లు కేటాయించాలని ఆదేశించారు. అంతకు ముందు రూ. 5లక్షలతో పద్మశాలీ సంఘం ప్రహరి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో బొడ్డుల నాగేష్, నాయకులు బుడిగె పెంటయ్య గౌడ్, నీరటి బాలనర్సయ్య, కొక్కొండ సిద్దులు, రాంగాళ్ల కృష్ణ, నాగపురి భాస్కర్, కోరె వీరయ్య, సంఘం అధ్యక్షుడు బొడ్డుల భిక్షపతి, నాయకులు జగన్నాథం, స్వామి తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యం


మాట్లాడుతున్న నల్ల నరేందర్

భువనగిరిటౌన్ : విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యమని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నల్ల నరేందర్ అన్నారు. ఆదివారం ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలందరికీ విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ఇవ్వాలన్నారు. ఈ నెల 17న రెండవ విడత రిలే నిరాహారదీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామన్నారు. నిరుపేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు నాణ్యమైన ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం అందించాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, అర్హులైన వారికి సాగునీటి వసతి గల ఎకరం భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు అశోక్ యాదవ్, శ్రీను యాదవ్, శ్రీకాంత్ మహారాజ్, శాంతి కుమార్, రవి మహారాజ్, నరేందర్ మహారాజ్ పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


భూదాన్‌పోచంపల్లి : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ హైస్కూల్ 1999–2000 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. సత్యనారాయణ, నామని భాస్కర్, పట్నం కృష్ణకుమార్, లక్ష్మీనారాయణ, నర్సింహాచారి, బస్వారెడ్డి, ఎం. వెంకటేశం, మహేశ్, ఐలయ్య, వెంకటమ్మ, లత, లలిత, అనిత, కమల, ఆర్గనైజర్లు చెరకు వెంకటేష్, రాజశేఖర్, భారత హరిప్రసాద్, శ్రీధర్, జీవన్, ప్రదీప్‌రెడ్డి, భూపాల్, మానుదాస్‌రెడ్డి, శేఖర్, శ్యామ్, తండ శివ, రజని, లావణ్య, కవిత, అమూల్య పాల్గొన్నారు.


వలిగొండ : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వలిగొండ: మండలంలోని శ్రీ వేంకటేశ్వర ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1972– 73 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, కిష్టయ్య,ఎక్బాల్, కృష్ణారెడ్డి, మల్ల య్య, నారాయణ, గోవర్ధన్, జమాలోద్దీన్, సిద్దప్ప, పుల్లారెడ్డి, శంకరయ్య, సుదర్శన్ రెడ్డి, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడి పూజ

బొమ్మలరామారం : మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలో ఆదివారం హరిహర పుత్ర అయ్యప్ప స్వామి మహా పడి పూజను మోహన గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి వారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వామి క్రిష్ణ, సింగిరెడ్డి మహిపాల్ రెడ్డి, గురుస్వామి కృష్ణారెడ్డి,శ్రీశైలం, నర్సింహ్మ,మహిపాల్‌రెడ్డి, శ్రీను, బీరప్ప, బాలకృష్ణరెడ్డి, భాను, శ్రీశైలం, నర్సింగ్ రావు, బాలకృష్ణ, శివ,భాను, వినయ్, నరేష్, పృథ్విరాజ్ రెడ్డి,సంపత్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్: మండలంలోని భట్టుగూడెం గ్రామంలో అయ్యప్ప సన్నిధానం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని స్వామివారి ఇందుర్తి సేవను నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి విగ్రహాన్ని ఊరేగింపు చేసి అయ్యప్పస్వాములు భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వాములు గంగదేవి జంగయ్య, అంజిరెడ్డి, శివ, కరుణాకర్, కృష్ణ, బాల్‌రాజు, ప్రణీత్, రఘువీర్, దిలీప్, వినిత్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట : మండలంలోని బోగారం గ్రామంలో ఆదివారం హరిహరపుత్ర అయ్యప్పస్వామి మహా పడిపూజను కనులపండువగా నిర్వహించారు. వేడుకల్లో నిత్య దీక్షాపరులు రుద్రాల శ్రీరాములు, గురుస్వాములు కదారి మల్లేశం, గంట్ల రాంరెడ్డి మాజీసర్పంచ్ అంతటి పద్మారమేష్, మాజీ వైస్ఎంపీపీ బద్దుల ఉమారమేష్, మాజీ ఎంపీటీసీ గోగు పద్మాసత్తయ్యయాదవ్, దాతలు కూనూరు సాయి కుమార్‌గోశిక వెంకటేశ్వర్లు, మద్దెపురి ఐలయ్య, తెలుసూరి మల్లేశం పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో శ్రీ అయ్యప్పస్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అయ్యప్పస్వామి పడిమెట్లను పూలు, ఫలాలు, దీపాలతో అలంకరించి సర్వాభిషేకాలు నిర్వహించారు

భువనగిరి : పట్టణంలోని సావర్కర్ చౌరస్తా వద్ద శనివారం రాత్రి అయ్యప్పస్వామి మహాపడిపూజను వైభవంగా నిర్వహించారు. సావర్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో విశ్వరూప, భువనగిరి గురుస్వాములచే అయ్యప్పస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణులు అప్పాల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రసంగం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

అడ్డగూడూరు : మండల పరిధిలోని చిన్నపడిశాల గ్రామానికి చెందిన గొర్ల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యేసు రత్నం , మాజీ సర్పంచ్ సైదులు, మాజీ ఉపసర్పంచ్ సికిందర్‌రెడ్డి,మాజీ డైరెక్టర్ యాదవరెడ్డి, తునికేసి చిన్న ఉపేందర్ రెడ్డి, తునికేసి సోమిరెడ్డి , కాపూరు చంద్రయ్య, కొప్పుల చంద్రరెడ్డి, సూడిద చిన్న గట్టయ్య ,సుడిద పెద్దగట్టయ్య, సూడిద లింగయ్య, లై సుధాకర్, లై భిక్షమయ్య, సుక్క మాదగిరి,సుక్క ఇస్తారి మారోజు బ్రహ్మచారి, కాటి చంద్రయ్య, రూపని నరసయ్య, ఇద్దయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా కాంగ్రెస్‌ను గెలిపించుకుంటాం

అడ్డగూడూరు : పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థినే సర్పంచ్‌గా గెలించుకుంటామని మాజీ సర్పంచ్ యేసురత్నం అన్నారు.ఆదివారం మండల పరిధిలోని చిన్నపడిశాల గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సస్పెండ్‌ను రద్దు చేసిన చేయకపోకపోయిన కాంగ్రెస్‌లోనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు యేసు రత్నం , సైదులు, మాజీ ఉపసర్పంచ్ సికిందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ యాదవ రెడ్డి, తునికేసి చిన్న ఉపేందర్ రెడ్డి, తునికేసి సోమిరెడ్డి , కాపూరు చంద్రయ్య, కొప్పుల చంద్రారెడ్డి, సూడిద చిన్న గట్టయ్య , సూడిద పెద్దగట్టయ్య, సూడిద లింగయ్య, సుధాకర్, భిక్షమయ్య, యాదగిరి, సుక్క ఇస్తారి, మారోజు బ్రహ్మచారి, కాటి చంద్రయ్య, రూపని నరసయ్య, ఇద్దయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు నిహారిక, సంధ్య

బొమ్మలరామారం : భువనగిరి జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీల్లో మండలంలోని మర్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పగిడిపల్లి నిర్మల జ్యోతి ఆదివారం తెలిపారు. అండర్ 16 బాలికల విభాగంలో రెండు కిలో మీటర్ల పరుగుపందెంలో 9వ తరగతికి చెందిన విద్యార్థినులు డి. నిహారిక ప్రథమ స్థానంలో , డి. సంధ్య తృతీయ స్థానంలో నిలిచారని తెలిపారు. ఈ నెల 22న నాగర్‌కర్నూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంఈఓ రోజారాణి, ఉపాధ్యాయ బృందం శ్రీకాంత్, స్వరూప రాణి, సిద్దులు, రాజు, ముఖిద్, రవీశ్వర్, సుజాత, శ్రీధర్, నాగజ్యోతి, శ్రీదేవి, గోపాల్ సుష్మ, భవాని అభినందించారు.

ముమ్మరంగా యాసంగి వరినాట్లు


కక్కిరేణిలో వరినాట్లు వేస్తున్న మహిళలు


రామన్నపేటలో వరినారు తీస్తున్న మహిళలు


ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు


రామన్నపేటలో వరం తీస్తున్న రైతు

రామన్నపేట మండలవ్యాప్తంగా యాసంగి వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మూసీ కాలువల నుంచి నీరు అందుతుండడం, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కురిసిన వర్షాలకు భూగర్భజలాలు పెరగడం వల్ల మండలంలో సుమారు 30వేల ఎకరాల్లో వరిసాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారుల అంచనా వేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. దున్నకం ట్రాక్టర్లకు, నాట్లు వేసే కూలీలకు, వరాలు తీసే మనుషులకు విపరీతమైన డిమాండ్ పెరిగింది.

– రామన్నపేట